క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

బహుభాషా గ్రంథావిష్కరణ



డాక్టర్ జయలక్ష్మిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ షైజీ

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శుక్రవారం బహుభాషా గ్రంథావిష్కరణ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, హిందీ ఆచార్యులు, ద్వితీయ భాషా విభాగాధ్యక్షులు డాక్టర్ పి.కె.జయలక్ష్మి సంపాదకత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాల ప్రాముఖ్యత అనే అంశంపై రచించిన ‘సమాగమ్’ బహుభాషా గ్రంథాన్ని ఆవిష్కరించిన సుమారు 50 మంది అధ్యాపకులను డాక్టర్ సిస్టర్ షైజీ అభినందించారు. సాహితీ రంగంలో డాక్టర్ జయలక్ష్మి సేవలను రచయితలు, సిస్టర్ షైజీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో రచయితలు ఎస్.దీప్తి, గౌరీనాయుడు, డి.కోటేశ్వరరావు, అనుపమ, మౌసమి, సుజాత, అనిత, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



అక్కయ్యపాలెంలో భారత వికాస్ పరిషత్ ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతంపేట: భారత వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, భారత వికాస్ పరిషత్ ఝూన్సీలక్ష్మీ భాయి నారి శాఖ సంయుక్తంగా శుక్రవారం అక్కయ్యపాలెం వాగ్దేవి స్కూల్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి పరిషత్ ప్రాంత అధ్యక్షుడు వంకాయల సన్యాసిరావు చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవిలో పాదచారులు, వాహన చోదకుల దాహాన్ని తీర్చడంలో చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు తమ వంతు సామాజిక బాధ్యతగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పరిషత్ సంయుక్త సంస్థల కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య పరీక్షలు



సీఐ, ఎస్ఐలకు బీపీ చెక్‌చేస్తున్న డాక్టర్ హేమ

సీతమ్మధార: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశాల మేరకు ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పోలీస్ సిబ్బందికి బీపీ, సుగర్, కంటి, రక్త, కొలస్ట్రాల్ పరీక్షలను డాక్టర్ హేమ నిర్వహించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉచిత వైద్య శిబిరం ద్వారా మందులు అందించి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా సీఐ విజయకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి కార్పొరేట్ లుక్

- రూ.25 లక్షలతో కార్యాలయ అభివృద్ధి
- ప్రజల కోసం సౌకర్యాల కల్పన
- ఆకర్షణీయ మొక్కలు, విద్యుద్దీపాల ఏర్పాటుతో సుందరంగా కార్యాలయ ఆవరణ



కార్యాలయ ఆవరణలో విద్యుద్దీప వెలుగులు



సుందరంగా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కార్యాలయ రూపురేఖలు అద్భుతంగా మారాయి. గత ప్రభుత్వాల పాలనలో ఈ కార్యాలయ పరిస్థితి ఘోరంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకా తహసీల్దార్ కార్యాలయం అందంగా తయారైంది. రూ.25 లక్షలతో చక్కగా అభివృద్ధి చేశారు. గత అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ప్రజలు, సిబ్బంది సహకారంతో కార్యాలయాన్ని సుందరంగా మార్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. ప్రస్తుత తహసీల్దార్ జి.శ్రీరామమ్మూర్తి పర్యవేక్షణలో కార్యాలయాన్ని చక్కగా.. పరిశుభ్రంగా ఉంచుతున్నారు. తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది గదులను చూడ చక్కగా తీర్చిదిద్దారు. రికార్డులు భద్రపరిచేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు.

పచ్చదనం.. విద్యుత్ కాంతులు

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పచ్చదనం పరిఢవిల్లేలా చర్యలు చేపట్టారు. పలు రకాల ఆకర్షణీయమైన మొక్కలు నాటారు. కొబ్బరి చెట్లకు జాతీయ జెండా రంగులు వేయించారు. ఫ్లోరింగ్, సీలింగ్, కలర్‌ఫుల్ పెయింటింగ్, ఆర్‌సీసీ రూఫ్, సీసీ రోడ్డు, ఫుట్‌పాత్, ఎలక్ట్రిఫికేషన్, విద్యుద్దీపాలు, కార్యాలయ ప్రధాన బోర్డు, ప్లాంటేషన్, కొత్త ఫ్యాన్‌లు, ప్రత్యేక గదుల ఏర్పాటుతో తహసీల్దార్ కార్యాలయం కొత్త రూపును సంతరించుకుంది. ఎప్పటికప్పుడు చెత్తాచెదారాన్ని తొలగించి.. పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో అర్జీలు దాఖలు చేసేందుకు కార్యాలయానికి వస్తున్న ప్రజలు అక్కడి సౌకర్యాలను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కార్యాలయంలో హెల్ప్ డెస్క్



డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది గది

చక్కటి జీవనశైలితో అదుపులో రక్తపోటు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెం నుంచి సత్యం జంక్షన్ మీదుగా ర్యాలీ కొనసాగి తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో నెల రోజుల వరకు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత రక్తపోటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధిక రక్తపోటుతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించాల్సి అవసరం ఉందన్నారు. గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు, అకాల మరణాలకు హైపర్ టెన్షన్ ప్రథమ కారణమన్నారు. చాలా మందికి అధిక రక్తపోటు లక్షణాలు లేకపోయినా, చికిత్స చేయకుండా వదిలేస్తే అది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. క్రమం తప్పకుండా తనిఖీ చేయడం, మందులు తీసుకోవడం ద్వారా రక్తపోటును నివారించవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా అధిక రక్తపోటు వల్ల ఎంతో మంది మరణిస్తున్నారని అన్నారు. ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ ప్రపంచ రక్తపోటు దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. అధిక రక్తపోటు తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు మరణాలను నియంత్రించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి(డెమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ జగదీష్‌ప్రసాద్, టీబీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రా’ రిషికకు సత్కారం



తన్వి రిషికను సత్కరిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



కేరళలో జరిగిన జూనియర్ మోడల్స్ పోటీలో విన్నర్‌గా నిలిచిన తన్వి రిషిక

సీతంపేట: నగరానికి చెందిన తన్వి రిషిక ఇటీవల కేరళలో జరిగిన జూనియర్ మోడల్స్ ఇంటర్నేషనల్ పోటీలో ప్రిన్సెస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఆమెకు కుటుంబ సభ్యులు, బంధువులు సత్కార కార్యక్రమం నిర్వహించారు. తన్వి రిషిక మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇప్పటికే చాలా ఫ్యాషన్ షోల్లో విజేతగా నిలిచానని తెలిపింది. రిషిక తండ్రి సురేష్‌కుమార్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి తన కుమార్తెకు ఉన్న ఆసక్తిని గమనించి ఫ్యాషన్ రంగంలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తన్వి తల్లి ప్రసన్న రేణుక మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన ఆంధ్రా ఫ్యాషన్ పోటీల్లో కూడా తన కుమార్తె విజేతగా నిలిచిందన్నారు. అనంతరం రిషికను ఘనంగా సత్కరించారు.

అడుగంటిన కొలను



కంబాలకొండలో నీరు లేకపోవడంతో ఒడ్డుకే పరిమితమైన బోట్లు



నీరు ఉన్న చోట బోటింగ్ చేస్తున్న సందర్శకులు

- కంబాలకొండలో ఒడ్డుకు పరిమితమైన బోట్లు
- కొన్ని చోట్ల 4, 5 అడుగుల లోతులో అంతంతమాత్రంగా విహారం

ఆరిలోవ: జాతీయ రహదారి సమీప కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో నీటి కొలను ఎండిపోతోంది. దీంతో బోటింగ్ నిర్వహణ అంతంత మాత్రంగా మారింది. కంబాల కొండల మధ్యలో ఉన్న ఈ కొలను వర్షాలు కురిసినప్పుడు నిండుతుంటుంది. సుమారు 20 నుంచి 25 అడుగుల లోతులో ఉండే ఈ కొలనులో సందర్శకుల కోసం బోటింగ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కొద్ది రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కొలనులో నీరు ఆవిరైపోతోంది. దీంతో బోటింగ్ చేయడానికి వీలుపడడం లేదు. బోట్లన్నీ ఒడ్డుకే పరిమితమయ్యాయి. కొన్ని చోట్ల 4, 5 అడుగుల లోతు ఉన్న చిన్న భాగంలో కొందరు సందర్శకులు సరదాగా బోటింగ్ చేస్తున్నారు. నీటితో నిండిన కొలనులో బోటింగ్‌తో చుట్టూ రౌండ్స్ వేసే అనుభూతి మాత్రం సందర్శకులకు కలగడంలేదు. వర్షా కాలం వస్తే గానీ ఈ కొలనులో నీరు కనిపించదు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

- మరో వ్యక్తికి గాయాలు



మృతుడు హాలీషా (ఫైల్)

మల్కాపురం: విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఇద్దరు కార్మికులు పశువును ఢీకొట్టి ప్రమాదం బారిన పడ్డారు. ఈ ఘటనలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలిలా.. 59వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో సమీపాన పాత చెక్‌పోస్ట్ ఏరియాలో నివసిస్తున్న ఎం.డి.హాలీషా(45) అనే వ్యక్తి హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లో మాజీ సొసైటీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. షిప్‌యార్డ్‌లోని హల్‌షాప్ డిపార్ట్‌మెంట్ వద్ద గార్డెనింగ్ పనులు చేస్తుంటాడు. శుక్రవారం యథావిధిగా విధులు ముగించుకుని మధ్యాహ్నం 3.40 గంటలకు తన ఇంటికి వెళ్లేందుకు షిప్‌యార్డ్ బయటకు రాగా.. ఆ సమయంలో తనకు పరిచయం ఉన్న మరో కార్మికుడు వెంకటరమణ ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. హాలీషా అతడి బండి వెనుక కూర్చోగా.. వారు ముందుకు సాగారు. యారాడకు వెళ్లే మార్గానికి ముందు ఓ పశువు రోడ్డుపైకి అకస్మాతుగా రావడంతో దానిని గుర్తించని వీరు పశువును ఢీకొట్టారు. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న వెంకటరమణ, వెనుక కూర్చున్న హాలీషాకు గాయాలయ్యాయి. హాలీషాకు తల వెనుక భాగాన తీవ్రంగా గాయం కావడంతో సమీపంలోని ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం హాలీషా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై విచారించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. మల్కాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూను సందర్శించిన అమెరికా ఆచార్యుడు



వీసీ ప్రసాదరెడ్డితో భేటీ అయిన అమెరికా ఆచార్యుడు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ఇండియానా పోలీస్‌కు చెందిన డాక్టర్ మంగీలాల్ అగర్వాల్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో సమావేశమయ్యారు. బోధన, పరిశోధన భాగస్వామ్యం, సంయుక్తంగా కోర్సుల నిర్వహణ, అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనే భావించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాం, ఆన్‌లైన్ కోర్సులను ఏయూ సిబ్‌తో పాటు ఇతర విభాగాలతో సంయుక్తంగా నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ఆచార్యులు ఆచార్య జి.గిరిజా శంకర్, ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం ఎర్నిమాంబ

- కోరిన వరాలిచ్చే కల్పవల్లి
- నేడు అమ్మవారి తొలేళ్ల సంబరం
- ఆదివారం ప్రధాన జాతర



జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ ఆలయం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: సంతానం లేని దంపతులకు సంతానలక్ష్మిగా, కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారు కీర్తి గడించారు. గత వందేళ్లగా అమ్మవారి చల్లని చూపు కోసం వేలాది మంది భక్తులు తరలి వస్తున్నారు. జ్ఞానాపురం, అల్లిపురం, అచ్చియ్యమ్మపేట ప్రజల ఇలవేల్పుగా ఎర్నిమాంబ కొలువై ఉన్నారు. భక్తిశ్రద్ధలతో కొలిస్తే తమ కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. శనివారం ఎర్నిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం, ఆదివారం ప్రధాన జాతర జరుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా భారీ అన్నసమారాధన, మరువారం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

అమ్మవారి ఆలయ చరిత్ర..

ఎనభై ఏళ్ల క్రితం విశాఖ కుగ్రామంగా ఉన్న నేపథ్యంలో అప్పటి భక్తులు అమ్మవారికి చిన్నగుడి నిర్మించారు. ఈ ప్రాంతంలో తుప్పలు, డొంకల మధ్య అమ్మవారు వెలసినట్టు భక్తులు చెబుతారు. పదుల సంఖ్యలోనే ఇళ్లు ఉండడంతో చీకటి పడితే జనసంచారం ఉండేది కాదు. రాత్రి వేళ ఈ మార్గంలో వెళ్లేందుకు అంతా భయపడేవారు. తర్వాత ఇక్కడ ప్రజలు నివసించటం మొదలు పెట్టడంతో ఊరు అభివృద్ధి చెందింది. ఆలయం పక్కగా జీవీఎంసీ అధికారులు రోడ్లు విస్తరించారు. గత ఇరవై ఐదేళ్లుగా అమ్మవారిని భక్తులు విశేషంగా పూజిస్తున్నారు. ఎర్నిమాంబ అమ్మవారికి తొమ్మిది మంది అక్కచెల్లెళ్లు ఉన్నట్లు పూర్వీకులు చెబుతారు. ప్రతి ఏటా మే నెల మూడో ఆదివారం నిర్వహించే ప్రధాన పండగను అద్వితీయంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఆది, మంగళ, బుధ, శుక్రవారాల్లో దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. విశాఖ జిల్లాతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి, తూర్పుగోదావరి తదితర జిల్లాల నుంచి కూడా భక్తులు అమ్మవారి సందర్శనార్థం వస్తుంటారు. ఆదివారం ఆలయం వద్దే వంటా వార్పు చేసుకుని అమ్మవారి చెంతనే ప్రసాదాలు స్వీకరిస్తారు. 2007లో సంఘ సభ్యులే దేవాలయాన్ని ఎండోమెంట్‌కు అప్పగించారు.

మా ఇంటి ఇలవేల్పు



ఎర్నిమాంబను మా ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్నాం. అమ్మవార్ని దర్శించుకున్న తర్వాతే ఏ పనైనా చేస్తాం. భక్తిశ్రద్ధలతో పూజిస్తే అమ్మ కోరిన కోర్కెలు తప్పక తీరుస్తుంది. అమ్మవారి జాతరలో కుటుంబమంతా మొక్కులు చెల్లించుకుంటాం.

– బంటుపల్లి నూకరాజు, గురుస్వామి, పూర్ణామార్కెట్

అమ్మ దీవెనలతో అంతా మంచే..



మా తాతల కాలం నుంచి మా కుటుంబంలో అందరి పేర్లు ఎర్నిమాంబ పేరుతో కలిసే ఉంటాయి. అమ్మవారిని సంతాన లక్ష్మిగా కొలుస్తున్నాం. అమ్మ దీవెనలు ఉంటే చల్లగా ఉంటాం. అమ్మ దర్శన భాగ్యం, నిత్య పూజలతో ఎవరికైనా మంచి జరుగుతుంది. నమ్ముకున్న వాళ్లకు కొంగు బంగారంగా అమ్మ కటాక్షిస్తుంది.

– పల్లా పద్మజ, భక్తురాలు, కంచరపాలెం

మౌలిక సదుపాయాలు కల్పించాం

ఎర్నిమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలకు ఆలయ చైర్మన్ ఎల్. రమణ, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. శనివారం జరిగే తొలేళ్ల సంబరాలు పూర్ణామార్కెట్ దుర్గమాంబ ఆలయం నుంచి ప్రారంభం అవుతాయి. ఆదివారం జరిగే ప్రధాన జాతరకు ఆలయ పరిసరాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాం.

– డీవీఎస్ సురేష్‌బాబా, ఈవో, ఎర్నిమాంబ ఆలయం

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. రూ.500 చెల్లించిన ఇద్దరు భక్తులు లేదా దంపతులను పూజలకు అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

మద్యం మత్తులో వ్యక్తిపై దాడి

గోపాలపట్నం: మద్యం మత్తులో మందు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎయిర్‌పోర్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. మాధవధార గాంధీనగర్ మహతి కాలనీలో చిన్ని సంతోష్ కుమార్, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. అక్కడే ఉంటున్న స్నేహితుడు వాసుతో కలిసి శుక్రవారం స్థానిక బార్‌కు వెళ్లి మద్యం తాగి తిరిగి కాలనీలోకి వచ్చారు. అక్కడ ఓ ఆటోలో సంతోష్‌కుమార్ అన్నయ్య అతడి స్నేహితులతో కలిసి కూర్చుని ఉన్నాడు. ఆ సమయంలో వరసకు బావ అయిన మహేష్ అనే వ్యక్తి సంతోష్‌ను మాట్లాడాలని పిలిచాడు. ఆటో దిగి వెళ్తున్న క్రమంలో మద్యం మత్తులో ఉన్న మహేష్ తనతో తెచ్చిన మందు సీసాతో సంతోష్‌పై దాడికి పాల్పడ్డాడు. ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్నేహితులు సంతోష్‌ను కేజీహెచ్‌కు తరలించారు.

మహేష్ స్థానికంగా స్క్రాప్ షాప్‌లో పనిచేస్తున్నాడు. అతడి భార్య ఎవరితోనో తిరుగుతున్నట్లు ప్రచారం చేస్తున్నాడనే అనుమానంతో సంతోష్‌ను మద్యం సీసాతో కడుపులో పొడిచేందుకు మహేష్ యత్నించాడు. తప్పించుకునే క్రమంలో అతడి ముఖంపై గాయమైంది. బాధితుడు సంతోష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంటి క్యాన్సర్‌పై 26న వైట్‌థాన్ రన్

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో రెటినోబ్లాస్టామా కంటి క్యాన్సర్‌పై అవగాహన కోసం ఈ నెల 26న ఆర్కే బీచ్ వద్ద వైట్‌థాన్ రన్ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఈ మేరకు హనుమంతవాక వద్ద ఎల్వీపీ ఆస్పత్రిలో శుక్రవారం ముఖ్యఅతిథిగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.జె శ్రీనివాస్, ప్రముఖ బాక్సింగ్ కోచ్ సీరా జయరాం, తదితరులు టీషర్ట్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్వీపీ ఆస్పత్రి ఓక్యులర్ అంకాలజిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో కనిపించే రెటినోబ్లాస్టామా వ్యాధిపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనికి సంబంధించిన చికిత్స సకాలంలో అందిస్తే పిల్లల కంటి చూపుతో పాటు ప్రాణాలకు రక్షణ కల్పించవచ్చన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కోసం ఆ రోజు ఉదయం 5.30 గంటలకు కాళీమాత గుడి వద్ద 3, 5, 10 కిలోమీటర్ల వైట్‌థాన్ రన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి బాలకృష్ణ రాయ్, ఎల్వీపీ వైద్యుడు వీరేంద్ర సచ్‌దేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలర్‌ను ఢీకొట్టిన ట్యాంకర్

- రోడ్డు పాలైన సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు, రెడీమిక్స్ కాంక్రీట్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాలర్‌ను ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో సిల్వర్ బ్రిక్స్ బ్యాగుల లోడుతో షీలానగర్ నుంచి ఆటోనగర్ వైపు ట్రాలర్ వస్తోంది. అదే సమయంలో ఆటోనగర్ నుంచి రెడీమిక్స్ కాంక్రీట్ లోడులో ట్యాంకర్ వస్తోంది. సరిగ్గా సిగ్నల్ పాయింట్ వద్ద ఆటోనగర్ లోపలికి వెళ్లడానికి ట్రాలర్ మలుపు తిరుగుతుండగా.. ట్యాంకర్ ట్రాలర్‌ను ఢీకొట్టింది. ట్రాలర్ రోడ్డు పక్కనున్న డివైడర్‌పైకి దూసుకుపోయింది. రోడ్డుపై సిల్వర్ బ్రిక్స్ బ్యాగులు చిందరవందరగా పడిపోగా, కాంక్రీట్ రోడ్డు పాలైంది. గాజువాక సీఐ కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాలకు కారణమైన రెండు భారీ వాహనాలను క్రేన్‌ల సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జరిగిన ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం కానీ, గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రోడ్డుపై పడిన సామగ్రిని తొలగించారు. సాయంత్రం వరకు గాజువాక నుంచి షీలానగర్ వైపు వచ్చే వాహనచోదకులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

